

గణేశ్ చవితి శుభాకాంక్షలు



వికారాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రుల ప్రారంభం సందర్భంగా నియోజక వర్గ, జిల్లా, రాష్ట్ర ప్రజలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించి, తలపెట్టిన కార్యాలను విజయవంతంగా పూర్తి చేయడానికి అనుగ్రహించే వినాయకుడి ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ తొమ్మిది రోజులు ప్రజలు భక్తి శ్రద్ధలతో వినాయకుని పూజించి ఆశీస్సులు పొందాలని కోరారు.

గణపతి పూజకు వేళాయె

ఉమ్మడి జిల్లాలో ముస్తాబైన మండపాలు

- విగ్రహాల ప్రతిష్ఠాపనకు సర్వం సిద్ధం
- ప్రతిమల విక్రయాలతో సందడిగా మార్కెట్లు
- రకరకాల ఆకారాల్లో ఆకట్టుకుంటున్న గణేశుడు
- పూజారులకు పెరిగిన డిమాండ్
- పలుచోట్ల ఉచితంగా మట్టి విగ్రహాల పంపిణీ

వినాయక చవితిని బుధవారం ఘనంగా నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లా వాసులు సిద్ధమయ్యారు. విగ్రహాల ప్రతిష్ఠాపనకు మండపాలను సిద్ధం చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. నేటి నుంచి ప్రారంభమయ్యే నవరాత్రి ఉత్సవాలను వైభవంగా జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. విగ్రహాలు, పూజ, అలంకరణ సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లో సందడి వాతావరణం నెలకొంది. ఈ సారి గణేశ్ విగ్రహాల ధరలను అమాంతం పెంచేశారు. పలు చోట్ల మట్టి వినాయకులను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు.

-రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి)

విద్యుత్ కాంతుల్లో ధగధగలు



మంచాలలో సిద్ధమైన మండపం

జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన గణేశ్ మండపాలను వివిధ రకాల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఒక రోజు ముందుగానే విద్యుత్ కాంతులు విరజిమ్మేలా నిర్వాహకులు సిద్ధం చేశారు. మండపాల వద్ద లంబోదరుడికి పూజలు చేసేందుకు పూజారులు తప్పని సరి కావడంతో వారికి భారీగా డిమాండ్ పెరిగింది. ఒక్కో పూజారి గరిష్ఠంగా నాలుగు నుంచి ఐదు వరకు మండపాలు పూజ చేసేందుకు బుక్ చేసుకున్నారు. ఐదు రోజులకు రూ.15వేలనుంచి 20 వేలు, 9-11 రోజులకు 20-25 వేల వరకు తీసుకుంటున్నారు.

లంబో'ధర'

వినాయ విగ్రహాల ధరలు విపరీతంగా పెరిగాయి. గతేడాది కంటే ఈ సారి 20 శాతం ధరలు పెంచేశారు. విగ్రహాల తయారీకి ఉపయోగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రంగులు, ఇతర ముడిసరుకుల ధరలు భారీగా పెరగటమే ఇందుకు ప్రధాన కారణమని విగ్రహాల తయారీదారులు అంటున్నారు.



సందడిగా మారిన మార్కెట్లు

వినాయక చవితి పండగతో ఉమ్మడి జిల్లాలోని మార్కెట్లన్నీ సందడిగా మారాయి. వినాయకుడికి ప్రీతిపాత్రమైన తుమ్మి ఆకులు, చింతకాయలు, మారేడుకాయలు, తామర ఆకులు, వివిధ రకాల పూజా సామగ్రి కొనుగోలు చేయడానికి ప్రజలు రావడంతో మార్కెట్లు కిటకిటలాడాయి.



ఆమనగల్లు: పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు

వివిధ రూపాల్లో..

వినాయక విగ్రహాలు వివిధ రకాల భంగిమలు, అనేక అవతరాల్లో మార్కెట్‌లో సందడి చేస్తున్నాయి. వివిధ రూపాల్లో దర్శనమిస్తున్నాయి. శివాజీ, శ్రీకృష్ణుడిగా, తిరుపతి వేంకటేశ్వరుడిగా, స్పైడర్ మెన్‌గా, మూషికవాహనుడు, ఇలా రకరకాల రూపాల్లో ఆకరణగా నిలిచాయి.

పెరిగిన పూలు, పండ్ల ధరలు..

వినాయక చవితి సందర్భంగా పూలు, పండ్ల ధరలు అమాంతం పెరిగాయి. కిలో చామంతి రూ. 250, బంతి రూ. 60-70, కిలో గులాబీకి రూ.200, లిల్లీ పూలు రూ.300-350 వరకు అమ్ముడు పోయాయి. చిన్న సైజు పూల దండ 100-150 వరకు విక్రయిస్తున్నారు. పెద్ద సైజు రూ.300-500 వరకు అమ్ముతున్నారు. అరటి పండ్లు డజన్‌కు 120-140 వరకు విక్రయిస్తున్నారు.





మట్టి గణపతిని పంపిణీ చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

మట్టి గణపతే.. మహా గణపతి

- కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మట్టి గణపతే.. మహా గణపతి అని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. వినాయక చవితి సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ సిబ్బందికి మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి విగ్రహాలతో నీటి వనరులకు ఎలాంటి నష్టం ఉండదన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసే విగ్రహాలను వాడొద్దని కోరారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ వెంకటనర్సయ్య, ఏఈఎస్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

గణేశ్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. కలెక్టరేట్‌లో గణేష్ ఉత్సవ ఏర్పాట్లు, ఇందిరమ్మ ఇళ్లు, వన మహోత్సవంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గణేశ్ నిమజ్జనాల కోసం గుర్తించిన చెరువుల వద్ద శానిటేషన్, భారీకేడ్లు, లైటింగ్, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. బేస్మెంట్ స్థాయి వరకు పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులకు పేమెంట్ చేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిక్కులు తీయాల్సిందే..

విద్యుత్ స్తంభాలకు ప్రమాదకరంగా కేబుల్, నెట్‌వర్క్‌ల వైర్లు

- హైకోర్టు ఆదేశాలతో తొలగిస్తున్న విద్యుత్ శాఖ
- సమయమివ్వాలని కోరుతున్న నిర్వాహకులు
- రెండు రోజులుగా కొనసాగుతున్న వైర్ల కత్తిరింపు

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాలను అరికట్టి, ప్రజల ప్రణాలను పరిరక్షించాలన్న హైకోర్టు ఆదేశాలతో ఆ శాఖ అధికారులు కరెంట్ స్తంభాలకున్న కేబుల్, నెట్‌వర్క్ వైర్ల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్‌లో జరిగిన ప్రమాదాల దృష్ట్యా తాలుకా, మండల కేంద్రాల్లోని విద్యుత్ స్తంభాలకు అస్తవ్యస్తంగా ఉన్న కేబుల్, నెట్‌వర్క్ వైర్లను తొలగించాలని ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. దీంతో షాద్‌నగర్ పట్టణంలో వైర్ల తొలగింపును ప్రారంభించారు. విద్యుత్ శాఖ షాద్‌నగర్ పట్టణ ఏఈ వినోద్ ఆధ్వర్యంలో కేబుల్, నెట్‌వర్క్ వైర్ల తొలగింపును చేపట్టడంతో ఇంటర్నెట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో కేబుల్, ఇంటర్నెట్ నిర్వాహకులు పరుగులు పెట్టి రెండు, మూడు రోజుల గడువు ఇవ్వాలని విద్యుత్ శాఖకు మొరపెట్టుకున్నారు.

ప్రమాదకరంగా వేలాడుతున్న వైర్లు

షాద్‌నగర్‌లో ఏ స్తంభానికి చూసినా అస్తవ్యస్తంగా ఉన్న కేబుల్, నెట్‌వర్క్ వైర్లు కనిపిస్తున్నారు. జియో నెట్‌వర్క్

మిగతా 8వ పేజీలో...

ప్రమాదకర వైర్లను తొలగిస్తున్నాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రమాదకరంగా ఉన్న కేబుల్, నెట్‌వర్క్ వైర్లను తొలగిస్తున్నాం. ట్రాన్స్‌కో నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇష్టానుసారంగా విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్లను లాగారు. వాటి వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మరమ్మతులు చేసేందుకు సిబ్బంది స్తంభం ఎక్కడానికి వీలులేకుండా కేబుల్ వైర్ల బిండలు వేలాడదీసి అడ్డంగా ఉన్నాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గిస్తూ, ప్రమాదకరంగా ఉన్న కేబుల్, నెట్‌వర్క్ వైర్లను తొలగిస్తాం.

- శ్యాంసుందర్‌రెడ్డి, ట్రాన్స్‌కో డీఈ, షాద్‌నగర్



షాద్‌నగర్‌లో విద్యుత్ స్తంభానికి అస్తవ్యస్తంగా వైర్లు

మీసేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐదు మండలాల్లో మొత్తం 11 మీసేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. వచ్చే నెల 30వ తేదీలోగా దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది. మండలం ప్రామాణికంగా అభ్యర్థి స్థానికుడై కనీస విద్యార్హత డిగ్రీ, ఆపై ఉండాలి. కంప్యూటర్ గురించి పూర్తి అవగాహన, సర్టిఫికెట్ సమర్పించాలి. దరఖాస్తుదారుని వయస్సు 21 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి. రాత పరీక్ష, మౌఖిక పరీక్ష ఆధారంగా అర్హులను ఎంపిక చేస్తారు. పేదలు, దివ్యాంగులకు ప్రాధాన్యం ఇస్తారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ పేరుపై రూ.500 డీడీ తీసి పూర్తి చేసిన దరఖాస్తుకు జత చేయాల్సి ఉంటుంది. గండిపేట మండలంలో వట్టి నాగులపల్లి, గండిపేట్, కిస్మత్‌పూర్, గందంగూడ, మొయినాబాద్ మండలంలో అజీజ్‌నగర్, హిమయత్‌నగర్, కనకమామిడి, జిల్లేడ్ చౌదరిగూడలో తుంపల్లి, ఎదిర, సరూర్‌నగర్ మండలంలో తుమ్మబౌలి, మంచాల మండలంలో లోయపల్లిలో మీసేవా కేంద్రాలను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 28వ తేదీ నుంచి సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది.



యూరియా కోసం ఆందోళన

సహకార సంఘాల ఎదుట రైతుల నిరీక్షణ

భూదాన్ భూములపై నివేదిక తయారీ!

వివరాల సేకరణలో నిమగ్నమైన అధికారులు

7

ప్రభుత్వ ఉద్యోగమిచ్చి ఆదుకోవాలి



చేవెళ్లలో ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు

చేవెళ్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పట్టణ కేంద్రంలో సోమవారం బైక్‌ను సిమెంట్ లారీ ఢీకొట్టిన ఘటనలో కోట్‌పల్లి మండల పరిధిలోని బీరెల్లి గ్రామానికి చెందిన తండ్రి తాండ్రా రవీందర్(32), కూతురు కృప(13) మృతి చెందారు. బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు చేవెళ్లలో రెండు గంటలకుపైగా ధర్నా చేశారు. దీంతో ఇరువైపులా భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపర్చగా మంగళవారం బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు పెద్దసంఖ్యలో ఆసుపత్రి వద్దకు చేరుకొని హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారంతోపాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రవీందర్ భార్య ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్టు ఏఎన్‌ఎంగా పని చేస్తోందని, ఆమెను ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తించాలని కోరారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం మృతదేహాలను గ్రామానికి తీసుకెళ్లారు.

పార్టీ వ్యవహారాలు ఆగమాగం

- వినూత్నంగా నిరసన తెలిపిన చేవెళ్ల ఎంపీ కొండా
- రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జికి బహుమతిగా ఫుట్‌బాల్
- జిల్లాల పార్టీ అధ్యక్షుల తీరుపై అసంతృప్తి



వికారాబాద్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో పార్టీ వ్యవహారాలను చక్కదిద్దేందుకు చేస్తున్న ప్రయత్నాలకు పార్టీ ముఖ్య నేతల నుంచి సహకారం కొరవడడంపై చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వినూత్నంగా నిరసన వ్యక్తం చేయడం చర్చనీయాంశంగా మారింది. పార్టీలో తనను ఫుట్‌బాల్ లాగా ఆడుకుంటున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి చంద్రశేఖర్ తివారీకి మంగళవారం ఆయన ఫుట్‌బాల్ ఇచ్చి నిరసన

మిగతా 7వ పేజీలో...

మా బడికి ఉపాధ్యాయులను నియమించాలి



లాల్‌పహాడ్‌లో రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

- రోడ్డెక్కి నిరసన తెలిపిన విద్యార్థులు

చౌదరిగూడ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తమ పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ మండల పరిధిలోని తుమ్మలపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. మంగళవారం లాల్‌పహాడ్ చౌరస్తాలో స్థానిక నాయకులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు, నాయకులు మాట్లాడారు. పాఠశాలలో 100 మంది విద్యార్థులకు నలుగురు ఉపాధ్యాయులే ఉన్నారు. గతంలో ఆరుగురు ఉపాధ్యాయులుండగా ఇటీవల ఒకరు జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం పొంది వెళ్లారన్నారు. హెచ్‌ఎంగా శంకర్ జీహెచ్‌ఎంగా పదోన్నతి పొంది బదిలీపై బొంరాస్‌పేట్ మండలం హకీంపేటకు వెళ్లారు. దీంతో పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందని, వెంటనే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. బడిబాట పేరుతో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి పిల్లలను చేర్పించుకొని ఇప్పుడు ఉపాధ్యాయులే లేకుండా పోతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తుమ్మలపల్లిలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. విద్యార్థులు చేస్తున్న రాస్తారోకోకు మాజీ జెడ్పీటీసీ స్వరూప, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సయ్యద్ హాఫీజ్, గ్రామస్తులు బాలయ్య, అర్షద్, అజాం, శ్రీధర్, రాములు వెంకటేశ్ తదితరులు మద్దతు తెలిపారు.

570 టన్నుల యూరియా పంపిణీ

కడ్తాల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కడ్తాల మండలంలో ఈ ఏడాది 570టన్నుల యూరియాను సరఫరా చేశామని వ్యవసాయ అధికారి కవిత తెలిపారు. యూరియా కోసం రైతులు ఎవరు ఆందోళన చెందరాదని సూచించారు. రైతులకు సరిపడే యూరియా సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు.

వర్షాలకు సూక్ష్మధాతువుల లోపం

- జిల్లా వ్యవసాయాధికారి రాజారత్నం

షాద్‌నగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు పంటల్లో సూక్ష్మ ధాతువుల లోపం వచ్చే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయాధికారి రాజారత్నం అన్నారు. ఫూడూరు మండలం చెన్‌గోముల్ రైతు వేదికలో సోమవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజరత్నం మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకు పంటలు సాగు చేయాలని తెలిపారు. అనంతరం కండ్లపల్లి శివారులో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ పొలంలో మెగ్నీషియం లోపాన్ని గుర్తించి నివారణ చర్యలు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి తులసీరాం, విసీర్ణాధికారి ఇలియాజ్, డీలర్లు నర్సింహారెడ్డి, అనంత్‌రెడ్డి, భూపతిరెడ్డి, రైతులు మహేష్, వెంకటయ్య, సురేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేతనం పెంచాలని ఆందోళన

నందిగామ, అగస్టు 26(ఆంధ్రజ్యోతి): నందిగామలోని పిత్తి ల్యామినేషన్ ఇంజినీరింగ్ పరిశ్రమ వద్ద వేతనాలు పెంచాలని మంగళవారం కార్మికులు ఆందోళన చేశారు. ఈ పరిశ్రమలో వెల్డింగ్ పనులు చేసే టెక్నీషియన్లు పనికి తగ్గ వేతనాలు లేవని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. యాజమాన్యం పట్టించుకోవడం లేదని పరిశ్రమ గేటు ముందు ఆందోళన చేపట్టారు. ఈఎస్‌ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అక్కడికి చేరుకున్న ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పడంతో కార్మికులు ఆందోళన విరమించారు. యాజమాన్యం స్పందిస్తూ.. కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు చెల్లిస్తున్నామని, అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఆందోళనకు నాయకులు పర్వతాలు, సాయిబాబ, అశోక్, రమేష్‌లు మద్దతు తెలిపారు.



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

ఆమనగల్లు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పేదల ఆర్థికాభివృద్ధి, ఆత్మగౌరవమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించి అభివృద్ధి పనులను ప్రారంభించారు. మండలాల్లో పలువురికి మంజూరైన రూ.6.5కోట్ల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఇచ్చిన హామీలన్నీ కాంగ్రెస్ అమలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్ పాలకులు పదేళ్ల సంపదను దోచుకొని రాష్ట్రాభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో బట్టు కిషన్ రెడ్డి, అప్పం శ్రీను, సూదిని కొడంగల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శంకర్, బొజ్జసాయిరెడ్డి, జగన్, అనంత్‌రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను తరలించొద్దు



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రమందజేస్తున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, పెద్ద అంబర్‌పేట్, శంషాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను తరలించొద్దని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కొంగరకలాన్‌లోని కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రమిచ్చారు. మీడియాతో మాట్లాడారు. సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పేరిట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను తరలించే ప్రతిపాదనకు బీఆర్ఎస్ వ్యతిరేకం అన్నారు. దీంతో ప్రజలకు అసౌకర్యం, స్థానికంగా ఉపాధి, అభివృద్ధి అవకాశాలు దెబ్బతింటాయన్నారు. పెద్దఅంబర్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్‌ల మధ్య ప్రభుత్వ భూములున్నందున ఇక్కడ కార్యాలయాలు ఉండడం తప్పనిసరి అని కిషన్‌రెడ్డి తెలిపారు.

న్యాయవాదులపై దాడులు అరికట్టాలి

» బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజ్ పటేల్

వికారాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులపై దాడులు అరికట్టాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజ్ పటేల్ అన్నారు. కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఈసీ మెంబర్, న్యాయవాది తన్నీరు శ్రీకాంత్‌పై కొంత మంది దుండగులు దాడిని ఖండించారు. ఈ ఘటనకు నిరసనగా జిల్లా బార్ అసోసియేషన్ న్యాయవాదులు మంగళవారం తమ విధులను బహిష్కరించి నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాది రక్షణ చట్టం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పోలీస్ వెంకట్‌రెడ్డి, కమల్‌రెడ్డి, లవకుమార్, గోవర్ధన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, యాదవరెడ్డి, సంపూర్ణానంద్, శంకరయ్య, మాధవ్‌రెడ్డి, శుక్లా వర్ధన్‌రెడ్డి, మొహ్మద్‌రఫీ, అశోక్ కుమార్, శుభప్రద్ పటేల్, ఆనంద్‌గౌడ్, గోపాల్, రాజశేఖర్, మోహన్‌రాజు, బాలయ్య, యాదగిరి పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన కల్పించాలి

» జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి లలితాదేవి

వికారాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి లలితాదేవి అన్నారు. డిస్టిక్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవీ ఎయిడ్స్ (దిశ) ఆధ్వర్యంలో మంగళవారం ఆలంపల్లి పాఠశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు డీఎంహెచ్‌వో చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రవీంద్ర యాదవ్, డెమో శ్రీనివాస్, హెచ్ఎం దేవయ్య, దిశ సీపీఎం నరేందర్, సీఎస్‌వో రమేశ్, ఐసీటీసీ కౌన్సిలర్ రత్నాకర్ పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి ఉన్నతంగా ఎదగాలి

మహేశ్వరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి కృషి, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ అన్నారు. మంగళవారం కళాశాలలో కెరియర్ గైడెన్స్, ఐక్యూ ఏసీ ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో విజయచందర్, చందన, శ్రీహరిరెడ్డి, ఇంతియాజుద్దీన్, జుహెదా బేగం, ఉపేంద్ర, గోపాల్, చిన్నోజీ, సునీత, రవళిక పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రుల అనంతరం నిమజ్జనోత్సవానికి ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శేరిగూడ చెక్‌డ్యాం వద్ద చేపడుతున్న పనులను మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ కేపీవీ రాజు, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, ఇరిగేషన్ ఏఈ హరిత మంగళవారం పరిశీలించారు. ఒకే రోజు నిమజ్జనాలు జరిగేలా చూడాలన్నారు. వీరి వెంట సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై రామకృష్ణ ఉన్నారు.

మహిళల భద్రతపై దృష్టి సారించండి

యాచారం: కాలానికనుగుణంగా పనితీరును మెరుగుపర్చుకోవాలని, నేరాల నియంత్రణకు, మహిళల భద్రతకు చర్యలు తీసుకోవాలని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్‌ను ఆమె తనిఖీచేశారు. కార్యక్రమంలో ఏసీపీ కేవీపీ.రాజు, సీఐ సత్యనారాయణ, ఎస్సైలు ఉన్నారు.

రోడ్ల మరమ్మతులకు ప్రాధాన్యం

కందుకూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మాజీ వైస్ఎంపీపీ గంగుల శమంతప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల నాయకుడు అప్జల్‌బేగ్ అన్నారు. నేదునూరు-మద్దులకుంట తండా 7కిలో మీటర్ల రోడ్డు పనులకు ప్రభుత్వం రూ:10కోట్లు మంజూరు చేసింది. మంగళవారం వారు పనులను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో సాధ పాండు రంగారెడ్డి, వి.బాబు, ఎస్.మాధవరెడ్డి, దర్శన్, శంకర్, వి.రవి, రమేష్, ప్రభు, బి.భాస్కర్, సద్దాం పాల్గొన్నారు.

నిర్భయంగా హక్కులు సాధించుకోవాలి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మహిళలు తమ సమస్యలను నిర్భయంగా చెప్పుకుని సాధికారికంగా నిలబడితేనే హక్కులు సాధించుకుంటారని హైకోర్టు న్యాయవాది కుమారి మాధురిభద్రిరాజు అన్నారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా అంతర్గత ఫిర్యాదుల కమిటీ, సాధికారత కమిటీల ఆధ్వర్యంలో 'మహిళలకు న్యాయపర సవాళ్లు-పరిష్కారాలు' అంశంపై నిర్వహించిన అవగాహనా సదస్సులో మాట్లాడారు. ఎక్కడైనా సమస్యలెదురైనప్పుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని చెప్పారు. ప్రిన్సిపాల్ డా.ఎస్.రాధిక మాట్లాడుతూ.. విద్యార్థినులు భద్రత కోసం తమ కళాశాలలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కమిటీల కన్వీనర్లు డా.ఎ.రచన, డా.పి.సురేఖ, వైస్‌ప్రిన్సిపాల్ డా.సురేశ్ పాల్గొన్నారు.

గణపయ్య రూపంలో విద్యార్థులు



కేశంపేట పాటిగడ్డలో గణపతి ఆకారంలో విద్యార్థులు

కొడంగల్‌రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి సందర్భంగా మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థులు వినూత్న రీతిలో భక్తిని చాటారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ మండల కేంద్రానికి శివారులో తాండూర్ రోడ్డు మార్గంలో ఉన్న పాఠశాల ఆవరణలో మంగళవారం గణపయ్య ఆకారంలో కూర్చుని లంబోదరుడి రూపాన్ని ఆవిష్కరించారు.

వినాయకుడి ఆకారంగా...

కేశంపేట : వినాయక చవితిని పురస్కరించుకొని మంగళవారం పాటిగడ్డ సమీప మేరీ ఇమ్మాక్యులేట్ పాఠశాలలో విద్యార్థులు వినూత్న ప్రదర్శన చేశారు. విద్యార్థులు గణపతి ఆకారంలో కూర్చొని ప్రదర్శనిచ్చారు. ఈ ఆకారం చూపరులను ఆకట్టుకుంది.

చాక్‌పీస్‌పై...

దౌల్తాబాద్ : మండలంలోని యాంకి గ్రామానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ సున్నపు అశోక్ తన చిత్రకళలో సిద్ధహస్తుడు. వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని వినాయకుడిపై తన కళాభక్తిని చాటుకున్నాడు. ఈ నేపథ్యంలో చాక్‌పీస్‌పై మూడు వైపులా 15వినాయక రూపాలను అద్భుతంగా తీర్చిదిద్దాడు. చాక్‌పీస్‌పై వినాయక రూపాలను చెక్కిన సున్నపు అశోక్‌ను పలువురు అభినందించారు.

గ్రామంలో 40ఏళ్లుగా ఒకే గణేశ్ విగ్రహం

యాలాల: అన్నసాగర్ గ్రామంలో ఓసీ, బీసీ, ఎస్సీ కులాలకు చెందిన 650మంది ఓటర్లు ఉన్నారు. ఏ పండుగైనా గ్రామంలో అందరూ కలిసిమెలిసి జరుపుకుంటున్నారు. అదేవిధంగా ఈ గ్రామస్తులందరూ కలిసి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద దాదాపు 40ఏళ్లుగా ఒకే ఒక్క వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. ఈ సంవత్సరం కూడా గ్రామంలోని అన్ని కాలనీల ప్రజలు, యువకులు ఒకేఒక్క వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నందుకు నిశ్చయించారు.



కొడంగల్‌లో గణపతి ఆకారంలో విద్యార్థులు



చాక్‌పీస్‌పై గణపతి రూపాలు

యూరియా కోసం ఆందోళన



యాచారం సొసైటీ వద్ద యూరియా కోసం ఆందోళన చేస్తున్న రైతులు

యాచారం, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం యాచారంలోని సొసైటీ కార్యాలయం వద్ద మంగళవారం రైతులు ఆందోళన చేశారు. 450 బస్తాలు రావాల్సిఉండగా రాకపోవడంతో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. వరి, పత్తి పంటలకు యూరియా అవసరం ఉందని రైతులు యూరియా కోసం పాట్లు పడుతున్నారు. సొసైటీ చైర్మన్ టి.రాజేందర్‌రెడ్డి సిబ్బందితో ఒక్కో రైతుకు రెండు మూడు బస్తాల ఇచ్చేందుకు స్లిప్‌లు ఇచ్చారు. సాయంత్రం వరకూ యూరియా రాక రైతులు ఇంటిదారి పట్టారు. బుధవారం ఉదయానికల్లా 450బస్తాల యూరియా వస్తుందని ఏడీఏ సుజాత చెప్పారు. కాగా ఏవో రవినాథ్ మాట్లాడుతూ.. నానో యూరియా వాడితే మంచి దిగుబడి వస్తుందన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో నిరసన

ఆమనగల్లు: యూరియా సరఫరా చేయాలని ఆమనగల్లులో బీజేపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పార్టీ మండలాధ్యక్షుడు శ్రీను ఆధ్వర్యంలో రైతులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. డీటీ వినయ్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. వరికుప్పల శ్రీనివాస్‌రెడ్డి, లాలునాయక్, వెంకటయ్య, వెంకటేశ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్, బిక్యనాయక్, కె.నరసింహ, శివ, దేవ్లా, రైతులు పాల్గొన్నారు.

సరిపడా అందించాలి

చేవెళ్ల: రైతులకు సరిపడా యూరియా అందించాలని రాష్ట్ర రైతు సంఘం, సీపీఐ రాష్ట్ర నాయకులు చేవెళ్ల ఆర్డీవో కార్యాలయ ఏవో రాజాశేఖర్‌కు వినతిప్రతం ఇచ్చారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ప్రభులింగం, సుధాకర్‌గౌడ్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సత్తిరెడ్డి, పాపయ్య, దేవి, లలిత, వెంకటమ్మ పాల్గొన్నారు.

ఫెడరేషన్‌లో నియంతృత్వ పోకడల్లేవ్

» టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) లో ఎలాంటి నియంతృత్వ పోకడలు లేవని, జర్నలిస్టుల ఐక్యతనే సంఘం బలం, బలగమని ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య అన్నారు. మంగళవారం మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లి వద్ద పావని ఫామ్ హౌజ్‌లో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, ఎం. సైదులు ఆధ్వర్యంలో ఫెడరేషన్ మూడో మహాసభల సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు రఘు రాజశేఖర్, జాతీయ కమిటీ సభ్యులు దేవేందర్, రంగారెడ్డి సీనియర్ జర్నలిస్టులు గణేష్, శ్రీనివాసాచారి, చంద్రశేఖర్, సురేష్, ఎండీ ఖాజాపాషా(కేపీ) జిల్లా కమిటీ సభ్యులు లక్కాకుల రమేష్ కుమార్, నరసింహారెడ్డి, ఆంజనేయులు పలువురు నియోజకవర్గాల అధ్యక్ష, కార్యదర్శులు, జర్నలిస్టులు హాజరై వారివారి అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా బసవ పున్నయ్య మాట్లాడుతూ టీడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా 3వ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంఘంలోని జర్నలిస్టుల్లో ఐక్యతను దెబ్బతీసేందుకు కొందరు ఇతర సంఘాల నాయకులు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా జిల్లా సమన్వయ సన్నాహక కమిటీని ప్రకటించారు. మహాసభల ఆహ్వాన కమిటీ చైర్మన్‌గా చిలీవేరు సురేష్, అధ్యక్షులుగా వి.రఘుపతి, కార్యదర్శిగా శ్రీనివాసచారి, కోశాధికారిగా నోముల శ్రీశైలం, ఉపాధ్యక్షులు శేరిబాయి గణేష్, లక్కాకుల రమేష్ కుమార్, యాదగిరి, ఆంజనేయులు, నరసింహారెడ్డి, సీహెచ్ రాజు, సురేందర్, డి.శంకర్, సహాయ కార్యదర్శిగా సైదులు, జోగు శ్రీనివాస్, ఎస్.చంద్రశేఖర్, మిద్దెల సత్యనారాయణ, నరేష్, జగన్, నరసింహ, రఘునందన్, ఈసీ మెంబర్లుగా వివిధ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఉన్నారు. గౌరవ అధ్యక్షులుగా బి.దేవేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

యూరియా పంపిణీపై అపోహలు వద్దు

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉష

నందిగామ, అగస్టు 26(ఆంధ్రజ్యోతి): యూరియా పంపిణీపై వస్తున్న అపోహలు నమ్మొద్దని, రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉష అన్నారు. మంగళవారం నందిగామ, చేగుర్ ప్రాథమిక వ్యవసాయ కేంద్రాలను సందర్శించారు. యూరియా పంపిణీ రికార్డులను పరిశీలించారు. అనంతరం చేగుర్ శివారులో వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులుకు పలు సూచనలు చేశారు. ద్రవ రూపంలో నానో యూరియా అందుబాటులోకి వచ్చిందని, దానిని పిచికారీ చేస్తే పంట దిగుబడి పెరుగుతుందన్నారు. యూరియా బస్తాతో పోలిస్తే ధర కూడా తక్కువ అని తెలిపారు. అనంతరం నందిగామ రైతువేదికలో జరిగిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

పార్టీ వ్యవహారాలు ఆగమాగం

(ఐదో పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో పార్టీ వ్యవహారాల పట్ల ఆయన అసంతృప్తిగా ఉన్నారు. వికారాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడు వ్యవహరిస్తున్న తీరుపై కొంత కాలంగా ఆగ్రహంగా ఉన్నారు. పార్టీలో బాధ్యులకు సీనియర్లకు మధ్య సమన్వయం కొరవడి వర్గాలుగా వేర్వేరు కుంపట్లు కొనసాగుతున్న విషయం తెలిసిందే. పార్టీ అధ్యక్షులు వ్యవహరిస్తున్న తీరు, నేతల మధ్య కొరవడిన సమన్వయం, పార్టీ కార్యక్రమాలపై ఏకపక్ష వైఖరిని చక్కదిద్దేందుకు తాను ప్రయత్నం చేస్తుంటే.. తనను పార్టీలో ఫుట్‌బాల్ ఆడుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది.

అధిష్ఠానం జోక్యం చేసుకునేలా..

జిల్లా అధ్యక్షులకు, సీనియర్ నాయకుల మధ్య అభిప్రాయ బేధాలు తొలగిపోయేలా చర్చించి సమన్వయంతో అందరూ ఐక్యతతో పార్టీ బలోపేతానికి పనిచేసేలా పార్టీ అధిష్ఠానం జోక్యం చేసుకునేలా చేస్తున్న ప్రయత్నాలకు స్పందన కొరవడడంతో ఆయన తీవ్ర ఆవేదనకు గురైనట్లు సమాచారం. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో పార్టీ వ్యవహారాన్ని చక్కదిద్దేందుకు చొరవ తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారిని కలిస్తే.. ఆయన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును కలవాలని చెబుతున్నారని, ఆయనను కలిస్తే అభయ్ పాటిల్‌ను కలవమంటున్నారని, ఇలా ఒకరిని కలిస్తే మరొకరి పేరు చెప్పడం పట్ల విశ్వేశ్వర్‌రెడ్డి ఆగ్రహంగా ఉన్నట్లు తెలిసింది.

పరిగి రోడ్డుకు మహర్దశ

» ఎమ్మెల్యే వీర్లపలి శంకర్



షాద్‌నగర్ ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ పనుల్లో ధ్వంసమైన షాద్‌నగర్-పరిగి రోడ్డుకు త్వరలోనే మహర్దశ పట్టనుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. మంగళవారం క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతూ.. పరిగి రోడ్డు నుంచి కిషన్‌నగర్ రోడ్డు వరకు ఉన్న ఒకటిన్నర కిలోమీటర్ల రోడ్డుకు విస్తరణ, డివైడర్లు, హైమాస్ట్ లైట్ల పనులు చేస్తామన్నారు. నెలరోజుల్లో పనులు చేపట్టి మూడు నెలలో పూర్తి చేస్తామన్నారు.

దేశ భద్రత, అభివృద్ధిని చూసి బీజేపీలో చేరికలు

కేశంపేట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ దేశ రక్షణ, భద్రత, అభివృద్ధికి చేస్తున్న కృషిని చూసి యువత పార్టీలో చేరుతున్నారని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే.అరుణ అన్నారు. మహబూబ్‌నగర్‌లో ఎంపీ కార్యాలయంలో మంగళవారం కేశంపేటకు చెందిన తలసాని పవన్‌కుమార్‌రెడ్డితో పాటు 50మంది యువకులు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నుంచి మంగళవారం బీజేపీలో చేరారు. వీరికి ఎంపీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ సభ్యత్వాన్ని అందించి, కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, నరసింహ, కంచుకోట మహేష్, నరేందర్‌రెడ్డి, పల్లె అంజయ్య, శివాజీ, తిరపతి, సతీశ్, దశరథ, మల్లేశ్‌కుమార్‌గుప్తా, గోపాల్‌రెడ్డి, విమల్, మధు పాల్గొన్నారు.

టీకాల శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తూర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న పీపీఆర్ వ్యాధి నివారణ టీకాల శిబిరాలను గొర్రెలు, మేకల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ స్ఫూర్తి తెలిపారు. ఇన్ముల్‌నర్వలో మంగళవారం స్ఫూర్తి ఆధ్వర్యంలో జీవాలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా స్ఫూర్తి మాట్లాడుతూ.. గ్రామాల్లో పీపీఆర్ టీకాల కోసం శిబిరాలను ఏర్పాటు చేశామని, గొర్లు, మేకలకు విధిగా టీకాలు వేయాంచాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది క్రిష్ణ, రవి, రైతులు పాల్గొన్నారు

జేపీ దర్గాను దర్శించుకున్న హార్టికల్చర్ డైరెక్టర్

కొత్తూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఇన్ముల్‌నర్వలో గల హజ్రత్ జహంగీర్ పీర్ దర్గాను మంగళవారం రాష్ట్ర హర్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్‌బాషా దర్శించుకుని ప్రార్థనలు చేశారు. కొత్తపేటలో నిర్వహించిన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమె మార్గమధ్యంలో దర్గాను దర్శించుకున్నారు. ముజావర్లు ఆమెకు తలపాగా చుట్టి స్వాగతం పలికారు. కార్యక్రమంలో దర్గా సిబ్బంది జహంగీర్, హర్షద్, రహమత్, పాషా, బురాన్, సల్మాన్, ముజావర్లు పాల్గొన్నారు.



చాదర్‌ను తీసుకువస్తున్న యాస్మిన్‌బాషా

ఫ్యూచర్ సిటీ రేడియల్ రోడ్డు ఏర్పాటుకు ముందడుగు

» పరిహారం చెక్కులు అందించిన అదనపు కలెక్టర్

కందుకూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ఫ్యూచర్ సిటీ వరకు రేడియల్ రోడ్డు వేయడానికి ముందడుగు పడింది. ఔటర్‌రింగ్ రోడ్డు ఎగ్జిట్ 13 నుంచి కందుకూరు మండలం మీర్కాన్‌పేట రెవెన్యూ వరకు మొదటి దశలో చేపట్టనున్న రోడ్డు కోసం ఆరు నెలలుగా రెవెన్యూ అధికారులు మండలంలోని తిమ్మాపురం, లేమూరు, రాచులూరు గ్రామాల్లో సర్వే చేస్తున్నారు. రోడ్డు కోసం కొందుకూరు రైతులు తమ భూములు ఇవ్వమని న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ప్రభుత్వం పరిహారం చెల్లించడానికి ముందుకు వచ్చింది. తిమ్మాపురం, రాచులూరు రెవెన్యూలో కొందరు రైతులు తమ భూములు ఇవ్వడానికి ముందుకు రావడంతో మంగళవారం వారికి పరిహారం చెక్కులను అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సేకరణలో 20 గుంటల భూమి ఇచ్చే రైతుకు 60 గజాల ఇంటి స్థలం, 20 గుంటల కంటే ఎక్కువ, ఎకరానికి 121 గజాల ఇంటి స్థలాన్ని ఇవ్వనున్నట్లు తెలిపారు. దీనికోసం మండలంలోని లేమూరు, తిమ్మాపురం గ్రామాల్లో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో లేఔట్ వేయనున్నట్లు పేర్కొన్నారు. తిమ్మాపురం రెవెన్యూలో ఆరుగురు రైతులు నాలుగెకరాల 34 గుంటల భూమిని రోడ్డు కోసం ఇవ్వడానికి ముందుకు వచ్చారని, వారికి రూ.3 కోట్ల 99 లక్షల 78వేల 801 పరిహారం చెక్కులను అందించినట్లు తెలిపారు. రాచులూరు రెవెన్యూలో 43 మంది రైతులు 34 ఎకరాల 04గుంటల భూమి ఇవ్వడానికి ముందుకు వచ్చారని, వారికి రూ.32 కోట్ల 80లక్షల 56వేల 294 పరిహారం చెక్కులను అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు, ఆర్డీవో కె.జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ కె.గోపాల్, సీఐ సీతారాం, అర్జున అవార్డు గ్రహీత వి.రవికాంత్‌రెడ్డి, ఆర్ఐ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనాలను విజయవంతం చేయాలి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): అధికారులు అందుబాటులో ఉండి గణేశ్ నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మల్కాజ్‌గిరి అడిషనల్ డీసీపీ వెంకటరమణ అధికారులకు సూచించారు. ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం అన్నిశాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. విద్యుత్‌లైట్లు, వైద్యశిబిరం, మరుగుదొడ్లు, క్రేన్లు, సీసీ టీవీలు, నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సూచిక బోర్డులు, చెరువుకు ఇరువైపుల రెండు వరుసల బారికేడ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలీసులకు, అధికారులకు గంగపుత్ర సంఘంలో భోజన సౌకర్యం కల్పించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ పంజాల రాజేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి, సీఐలు రాజువర్మ, శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ రవీందర్, నిత్యానంద్, డీటీ రాజేందర్, ఇరిగేషన్ ఏఈ పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

భూదాన్ భూములపై నివేదిక తయారీ!

వివరాల సేకరణలో నిమగ్నమైన అధికారులు

యాచారం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని తాటిపర్తిలోని సర్వే నంబర్ 104లోని 250 ఎకరాల భూదాన్ భూముల వివరాలను సేకరించడంలో రెవెన్యూ అధికారులు నిమగ్నమయ్యారు. ఫార్మాసిటీ భూసేకరణలో భూదాన్ భూములకు పరిహారంపై పత్రికల్లో వచ్చిన కథనాలతో రెవెన్యూ అధికారులు సమగ్ర నివేదిక తయారు చేస్తున్నట్లు సమాచారం. 104 సర్వే నంబర్‌లో ఎంత భూమి ఉంది, ఎంత మంది సాగు చేశారు, ఎంత మందికి పరిహారం అందించారనే విషయమై నివేదిక సిద్ధం చేస్తున్నారు. నేడో రేపో ఈ నివేదిక సీఎంవో కార్యాలయానికి అందనుంది. కాగా, 1954లో భూదానోద్యమం సందర్భంగా తాటిపర్తి గ్రామానికి చెందిన బొక్క సీతారెడ్డి కుటుంబీకులు భూదాన్ యజ్ఞ బోర్డుకు 104 సర్వే నంబర్‌లోని 250 ఎకరాలను దానం చేశారు. అప్పటినుంచి భూదాన్ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో ఉందా, లేదా? అనే కోణంలో అధికారులు విచారిస్తున్నారు. రెవెన్యూ అధికారులు భూదాన్ బోర్డు రికార్డులను, రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ నివేదిక సిద్ధం చేస్తున్నారు. అక్రమంగా పరిహారం పంపిణీ జరిగిందని తేలితే పరిహారం పొందిన వారి నుంచి నిధులు రికవరీ చేస్తారా, లేదా, వారిపై ఏ మేరకు చర్యలుంటాయనేది తెలియాల్సి ఉంది. ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారించడానికి సీసీఎల్ఏ అధికారులు, లేదా సీఎంవో కార్యాలయ అధికారులు గ్రామానికి చేరుకొని విచారించనున్నట్లు గ్రామంలో ప్రచారం జరుగుతోంది. రెవెన్యూ అధికారులు రికార్డులను పరిశీలిస్తున్న విషయం బయటకు పొక్కకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీనిపై సీఎం చాలాసీరియస్‌గా ఉండడంతో అధికారులు నివేదిక పక్కాగా తయారు చేయడంపై నిమగ్నమయ్యారు.

మట్టి గణపతులనే పూజించాలి


తుక్కుగూడ మునిసిపల్ ఆఫీసు వద్ద పంపిణీకి పెట్టిన మట్టి వినాయకులు


కడ్తాల్ : మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న గంప వెంకటేశ్, సీఐ గంగాధర్


ఆదిభట్ల: విద్యార్థులకు వినాయకుల పంపిణీ

మహేశ్వరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పర్యావరణ హితానికి ప్రతీ ఒక్కరు మట్టి వినాయకులనే నెలకొల్పి పూజించాలని తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ వాణి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. అలాగే గట్టుపల్లి వీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేవారు.

కడ్తాల్: మట్టి వినాయకులనే పూజించాలని సీఐ గంగాధర్ అన్నారు. కడ్తాల్‌లో గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ నిర్వహించారు. సీఐ, ట్రస్ట్ చైర్మన్ గంప వెంకటేశ్ కలిసి వెయ్యి మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. పదేళ్లుగా గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వినాయకులను పంపిణీ చేస్తుండడం గొప్ప విషయం అని సీఐ అన్నారు. కార్యక్రమంలో ఎస్సై చంద్రశేఖర్, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గంప శ్రీనివాస్ గుప్తా, వాసుదేవ్, ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బి.రామకృష్ణ, మహేందర్‌గుప్తా, రవికుమార్‌గుప్తా, వెంకటేశ్, సత్యనారాయణ, రాజశేఖర్, వీరేశ్, రవి, శ్రీను, కృష్ణయ్య, రామకృష్ణ, ఎర్రోళ్ల రాఘవేందర్, బిక్షపతి, శ్రీనివాసచారి, చంద్రమౌళి పాల్గొన్నారు.

ఆదిభట్ల: మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడుదామని శ్రీనివాస్ స్కూల్ చైర్మన్ లక్కరాజు శ్రీనివాస్‌రాజు, ప్రధానోపాధ్యాయులు వర్కల పరమేష్ అన్నారు. శ్రీనివాస్ స్కూల్, ఆదిభట్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయనాలతో వచ్చే సమస్యలపై వివరించారు. కార్యక్రమంలో టీచర్లు, విజయలక్ష్మి, రామ్మోహన్, లక్ష్మయ్య, తిరుపతి, అశోక్, లక్ష్మీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ బి.సత్యనారాయణరెడ్డి, అధికారులు తదితరులు


కొత్తూర్: తరలుతున్న గణనాథుడు

ఇబ్రహీంపట్నం: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులనే పూజిద్దామని ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ బి.సత్యనారాయణరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల విగ్రహాలను పంపిణీ చేశారు. ప్రశాంత వాతావరణంలో గణేశ్ ఉత్సవాలను జరుపుకోవాలని కోరారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు మట్టి గణపతి ప్రతిమలను తయారుచేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై వెంకటయ్య ఉన్నారు.

ఊరూవాడా చవితి ఏర్పాట్లు

ఆమనగల్లు: వినాయక చవితి ఉత్సవాలకు ఊరువాడ ముస్తాబయ్యాయి. బుధవారం వినాయక చవితిని పురస్కరించుకొని ఏర్పాట్లు చేశారు. ఆమనగల్లులో వినాయక విగ్రహాల అమ్మకాలు భారీగా జరిగాయి. పూజాసామగ్రి కొంటున్నారు. పెద్ద విగ్రహాలను హైదరాబాద్ నుంచి గ్రామాలకు తరలిస్తున్నారు.

మంచాల: మండల పరిధి గ్రామాల్లో గణేష్ ఉత్సవాలకు మండపాలు ముస్తాబయ్యాయి. ఇంటీరియర్ డిజైన్లతో యువకులు పోటీపడి తీర్చిదిద్దుతున్నారు. మరి కొద్దిరోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలుండడంతో వినాయక మండపాలకు రాజకీయ నాయకులు తమ వంతు ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నారు.

కొత్తూర్: మండల కేంద్రంతో పాటు, గ్రామాలకు గణనాథులను తరలిస్తున్నారు. మండల కేంద్రంలో మండపాలను లైట్లతో ముస్తాబు చేశారు. వినాయక చవితిని పురస్కరించుకుని పూలు, కిరాణ, మిఠాయిల దుకాణాలు కిక్కిరిసిస్తున్నాయి.

మండపాలకు సౌండ్ బాక్స్‌ల వితరణ

కేశంపేట: కొండారెడ్డిపల్లి, వాల్యతండాలో వినాయక మండపాలకు బీఆర్ఎస్ నాయకుడు ప్రేమ్‌కుమార్‌గౌడ్ సౌండ్ బాక్స్‌లను అందజేశారు. రూ.60వేల విలువైన బాక్స్‌లను తన నివాసంలో మండపాల నిర్వాహకులకు అందజేశారు. ప్యాక్స్ డైరెక్టర్ రవీందర్ గౌడ్, జగన్మోహన్‌రెడ్డి, గోపాల్, రవి, లింగం, శ్రీను, సందీప్, కుమార్, మనీష్‌గౌడ్, సంతోష్ పాల్గొన్నారు.

నింగినంటిన విగ్రహాలు, సామగ్రి ధరలు

యాచారం: వినాయక విగ్రహాల ధరలు పెరిగాయి. రెండుఫీట్ల మట్టి వినాయక విగ్రహం రూ.8వేలు, రసాయనాల రెండుఫీట్ల వినాయక విగ్రహం రూ.10వేలు చెబుతున్నారు. చిన్న మట్టి విగ్రహాలు రూ.1,500 నుంచి రూ.2,500 వరకు అమ్ముతున్నారు. టార్పాలిన్ రూ.3,500 నుంచి 7,500 వరకు విక్రయించారు. అలంకరణ వస్తువుల ధరలూ పెరిగాయి. ఒక్క మారేడు కాయ రూ.20కి విక్రయించారు. కాగా మేడిపల్లి హైస్కూల్ విద్యార్థులు మట్టి వినాయకులను తయారుచేశారు. వారిని హెచ్ఎం ఉదయశ్రీ, పీఆర్‌జీ గ్రూప్ చైర్మన్ రవీందర్‌గుప్తా అభినందించారు.


కేశంపేట: సౌండ్ బాక్స్‌లను అందజేస్తున్న ప్రేమ్‌కుమార్‌గౌడ్



శంకర్‌పల్లి: కొండకల్ గ్రామంలోని విద్యార్థులకు మట్టి వినాయకులను అందిస్తున్న నిర్వాహకులు


ఆమనగల్లులో జోరుగా వినాయక విగ్రహాల అమ్మకాలు

మైసిగండి హుండీ ఆదాయం రూ.22.48లక్షలు

కడ్తాల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి):మైసిగండి మైసమ్మ ఆలయంలో బుధవారం హుండీని లెక్కించారు. ఫౌండర్ ట్రస్టీ రామావత్ సిరోలి పంతు, ఈవో స్నేహలత, ఎండోమెంట్ సహాయ కమిషనర్ చంద్రశేఖర్‌ల సమక్షంలో హుండీ లెక్కించారు. 90రోజులకు రూ.22.48లక్షల ఆదాయమొచ్చిందని ఈవో తెలిపారు. కార్యక్రమంలో భాస్కర్, అరుణ్, ఉపప్రధానార్చకులు యాదగిరి, కృష్ణ, చంద్రయ్య, రాములు, శ్రీనివాసులు, ఆనంద్, వెంకటరమణ, పాల్గొన్నారు.

చేవెళ్లలో ఆక్రమణల తొలగింపు


రోడ్డు పక్కన డబ్బాలను తొలగిస్తున్న అధికారులు

చేవెళ్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): చేవెళ్లలో చిరు వ్యాపారుల డబ్బాలను మున్సిపల్, పోలీసు అధికారులు తొలగించారు.మంగళవారం ఉదయం 6గంటల నుంచి కూరగాయలు, పండ్లు, పూలు, టీ, టిఫిన్ సెంటర్లు, ఐరన్‌షాపు తదితర డబ్బాలను జెసీబీతో తొలగించారు. వాటి వ్యర్థాలను ట్రాక్టర్లతో దూరంగా తరలించారు. చిరు వ్యాపారులు వేడుకున్నా పట్టించుకోలేదు. తమ జీవితాలు రోడ్డున పడ్డాయని విలపించారు. డబ్బాల్లోని వస్తువులను సైతం తీసుకోనివ్వలేదని అన్నారు. బస్‌స్టాండ్ వద్ద డబ్బాలను, పీఎస్ ప్రహరీకి ఆనుకుని ఉన్న రాజకీయ పార్టీల దిమ్మలను సైతం తొలగించారు. అయితే కొన్నిచోట్ల తమ సొంత స్థలాల్లోని డబ్బాలనూ తొలగించారని బాధితులన్నారు. తమకు మరో చోట స్థలం చూపాలని కోరారు. చేవెళ్లలో రోడ్డు మధ్యలో ఉన్న నేతలు పట్నం రాజేందర్‌రెడ్డి, ఇంద్రారెడ్డి విగ్రహాలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఇవి ప్రమాదాలకు నిలయంగా మారినా అధికారులకు కన్పించడం లేదా? అని ప్రశ్నించారు. రోడ్డు ఆక్రమించిన డబ్బాలన్నీ తొలగించాలని స్థానికులు కోరారు. ఇదిలా ఉంటే దుకాణాల తొలగింపుతో పూలు, పండ్లు, కూరగాయల వ్యాపారులు రైతుబజార్‌లో అమ్మకాలు సాగించారు. చేవెళ్లలో ట్రాఫిక్ రద్దీ నివారణకు డబ్బాలను తొలగిస్తున్నందుకు వేరేచోట స్థలాన్ని కేటాయించి ఆర్థిక సాయం చేయాలని చేవెళ్ల నియోజకవర్గం సీపీఐ కన్వీనర్ కె.రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభులింగం అన్నారు. సమావేశంలో నాయకులు ఎం.సుధాకర్‌గౌడ్, పాపయ్య, ఎండీ ఏసు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే యూరియా కొరత


మాట్లాడుతున్న ఏఎంసీ చైర్‌పర్సన్ గీతానర్సింహ

ఆమనగల్లు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతానర్సింహ అన్నారు. సాగు అవసరాలకు సరిపడే ఉత్పత్తి, దిగుమతి చేయక దేశంలో యూరియా కొరత ఏర్పడిందన్నారు. ఆమనగల్లు మార్కెట్ యార్డులో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులకు సాగుకు సరిపడే యూరియాను అందజేయాలని కేంద్రాన్ని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు బీజేపీ పన్నిన కుట్రలో భాగమే యూరియా కొరత అన్నారు. బీజేపీయేతర పాలక రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందన్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది సాగు విస్తీర్ణం బాగా పెరిగిందన్నారు. అయినా విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. బీజేపీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు సరికాదన్నారు. యూరియా కేటాయింపుల పెంపులో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ విఫలమయ్యారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై వొత్తిడి తెస్తుందని, రైతులు ఆందోళన చెందొద్దన్నారు. సమావేశంలో ఏఎంసీ డైరెక్టర్లు రవీందర్, శ్రీశైలం, పాండురంగయ్య, అంజయ్య పాల్గొన్నారు.

చిక్కులు తీయాల్సిందే..

(ఐదో పేజీ తరువాయి)

ప్రొవైడర్ మినహా మిగిలిన అన్ని నెట్‌వర్క్ ప్రొవైడర్లు విద్యుత్ స్తంభాలకు కేబుళ్లు లాగి కనెక్షన్లిచ్చారు. షాద్‌నగర్ పట్టణంలో ఏడెనిమిది నెట్‌వర్క్‌లు పనిచేస్తుండగా ఒక స్తంభం నుంచి మరో స్తంభానికి 15 నుంచి 20వైర్లు ఉన్నాయి. వాటిలో కొన్ని ప్రమాదకరంగా తేలాయి. స్తంభాలకు వైర్ల మూటలు ప్రమాదకంరగా ఉన్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెట్‌వర్క్‌లు మారినా పాత వైర్లను తొలగించడం లేదు. విద్యుత్ శాఖ కండక్టర్ పోల్‌కు 18ఫీట్ల ఎత్తులో ఉంటే కేబుళ్లు 15ఫీట్లకుపైన ఉండాలి. విద్యుత్ మరమ్మతులకు అంతరాయం కలగకుండా ఉండాలని అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.

గడవు ఇవ్వకపోతే నెట్‌కట్!

కేబుల్, నెట్‌వర్క్ వైర్లను సరిచేసుకోవడానికి గడువివ్వాలని కేబుల్, నెట్‌వర్క్‌ల నిర్వాహకులు కోరుతున్నారు. సమాచారం ఇవ్వకుండా కేబుల్, ఫైబర్ వైర్లను కత్తిరిస్తూపోతే ఇంటర్నెట్ నిలిచి వినియోగదారులు ఇబ్బంది పడతారని పేర్కొంటున్నారు. కేబుల్, నెట్‌వర్క్ వైర్లను సరిచేసుకునేందుకు రెండు, మూడురోజుల సమయం ఇవ్వాలని కోరామని సిటీ కేబుల్ నిర్వాహకుడు ముత్యాలు తెలిపారు. నెట్‌వర్క్ వదిలేసి పోయినవారితోనే సమస్య వస్తున్నదని, అందరం కలిసి పరిష్కరించి, ప్రమాదాలు జరుగకుండా కేబుల్ వైర్లను సరిచేసుకుంటామని తెలిపారు.

పని నుంచి ఇద్దరు బాలురకు విముక్తి

నందిగామ: మండల పరిధి మేకగూడలో బ్లోటెక్ ప్యాకేజింగ్ పరిశ్రమలో ఇద్దరు బాలలకు పని నుంచి విముక్తిం కల్పించారు. మంగళవారం ఏఐటీయూసీ నాయకులు పానుగంటి పర్వతాలు, స్థానిక నాయకులు షకీల్, రాములు, వేదవతి పరిశ్రమకు వెళ్లి బాలలకు విముక్తి కల్పించారు. బీహార్‌కు చెందిన బాలలు విక్రమ్‌కుమార్, దీపక్‌కుమార్ ఈ పరిశ్రమలో పనిచేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న నందిగామ సబ్‌ఇన్‌స్పెక్టర్ యాదయ్య, చైల్డ్‌లేబర్ అధికారి సంజయ్‌కుమార్, లేబర్ ఆఫీసర్ యాదగిరి పరిశ్రమకు చేరుకుని పరిశ్రమ యాజమాన్యంపై కేసు నమోదు చేసి బాలలను హోమ్‌కు తరలించారు.

ఆగాపల్లి-మంచాల రోడ్డు పనులను ప్రారంభించాలి

మంచాల: ఆగాపల్లి-కాగజ్‌ఘట్ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు సిలివేరు రాజు డిమాండ్ చేశాడు. నాయకులతో కలిసి కాగజ్‌ఘట్‌లో ధ్వంసమైన రోడ్డుపై ఆందోళన చేశారు. ఆగాపల్లి-మంచాల వరకు 10కిలోమీటర్ల రోడ్డు పనులకు రెండుసార్లు శంకుస్థాపన చేశారన్నారు. రోడ్డుకు ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర కంకరపోసి వదిలేశారని చెప్పారు. అధికారులు వెంటనే రోడ్డు పనులు చేయించకుంటే ప్రజలతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు యాదగిరి, నగేష్, యాదయ్య, బిక్షపతి, దానయ్య, భరత్, కృష్ణ, రాజు, రంజిత్, మణి పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా జీవితం అందరికీ ఆదర్శప్రాయం

కడ్తాల్: మానవతా మూర్తి మదర్ థెరిస్సా జీవితం స్ఫూర్తిదాయకమని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కడ్తాల్‌లో భారతరత్న, నోబెల్ పురస్కార గ్రహీత మదర్ థెరిస్సా జయంతిని నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు క్యామ రాజేశ్, బోసు ర వి, భానుకిరణ్, సందీప్, శ్రీకాంత్, వినోద్, రామకృష్ణ, సందీప్, రమేశ్, సోమరాజు, చందు, వినీల్, శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాడిని ఖండిస్తూ న్యాయవాదుల నిరసన

ఆమనగల్లు: హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ ఈసీ మెంబర్, న్యాయవాది తన్నీరు శ్రీకాంత్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ ఆమనగల్లులోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో న్యాయవాదులు నిరసన తెలిపారు. అసోసియేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి శిక్షించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అంబేకార్ యాదిలాల్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, సాంస్కృతిక కార్యదర్శి శేఖర్, లైబ్రెరీ సెక్రటరీ పస్పుల మల్లేశ్, న్యాయవాది వెంకట్‌గౌడ్, ఎగిరిశెట్టి మల్లేశ్, గణేశ్‌గౌడ్, మల్లేశ్, సంతోష్, జగన్‌గౌడ్, బిక్యనాయక్, శ్రీనివాస్, సర్దార్, తిరపతయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులు 31లోపు సర్టిఫికెట్లు అందజేయాలి

కేశంపేట: ఇంటర్ ఫస్టియర్ ఫేజ్-2లో అడ్మిషన్ పొందిన విద్యార్థులు తమ టెన్త్ సర్టిఫికెట్లను ఈ నెల 31లోపు కాలేజీలో అందజేయాలని కొత్తపేట జూనియర్ కళాశాల ఇన్‌చార్జీ ప్రిన్సిపల్ అసీఫొద్దీన్ తెలిపారు. ఆధార్, పాస్‌పోర్ట్ సైజ్ కలర్ ఫొటోలు, టీసీలను కాలేజీలో అందజేయాలని కోరారు. గడువుకు ముందే ఇస్తే ఇంటర్ బోర్డుకు పంపేందుకు వీలుంటుందని తెలిపారు. సర్టిఫికెట్లు ఇవ్వన్ని విద్యార్థుల అడ్మిషన్ తిరస్కరించే ఆవకాశం ఉందని, ఇది గమనించాలన్నారు.

డ్రోన్ స్ప్రేయింగ్‌పై రైతులకు అవగాహన

కందుకూరు: పంటలపై డ్రోన్ స్ప్రేయింగ్‌పై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఏవో లావణ్య ఆధ్వర్యంలో నేదునూరులో వరి, మొక్కజొన్న పంటలపై పురుగు మందులు పిచికారి చేసి డెమో చూపించారు. కేవీకే ఎంహెచ్ ప్రతినిధి చంద్రకాంత్, వ్యవసాయ ఇంజినీర్ విజయ్‌కుమార్ మాట్లాడారు. శాస్త్రవేత్తలు టీవీరావు, భార్గవి, గౌతంవీర్ చౌహాన్, జి.రాజు, రైతులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కారు ఢీకొని నలుగురికి గాయాలు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి):రెండు బైక్‌లను కారు ఢీకొని నలుగురు గాయపడ్డ ఘటన మంగళవారం రాత్రి జరిగింది. ఇబ్రహీంపట్నం సమీప రాయపోల్ రోడ్డులో భారత్ ఎలక్ట్రానిక్ కంపెనీ ముందు నుంచి వెళ్తున్న రెండు బైక్‌లను ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. బైక్‌లపై ఉన్న ఇబ్రహీంపట్నానికి చెందిన యాదగిరి, వీరేశ్, శ్రీనులకు తీవ్ర, కారు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారిని ఆస్పత్రికి తరలించారు.

కల్లు సీసాతో దాడి.. కేసు నమోదు

చౌదరిగూడ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కల్లు దుకాణంలో వ్యక్తిపై దాడి చేసిన సంఘటన చౌదరిగూడలో సోమవారం రాత్రి జరిగింది. ఎస్సై కె.విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డె బావయ్య సోమవారం కల్లు తాగేందుకు కల్లు దుకాణానికి వెళ్లాడు. దుకాణదారు కల్లులేదని సమాధానమిచ్చాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ గొడవను చూసిన అదే గ్రామానికి చెందిన ఈడ్గి అనంతంగౌడ్.. బావయ్యను తిడుతూ.. కల్లు సీసాతో ముఖంపై కొట్టాడు. దీంతో బావయ్యకు గాయాలయ్యాయి. అతడిని మొదట కొందుర్గు ఆసుపత్రికి అనంతరం మెరుగైన చికిత్స కోసం షాద్‌నగర్ సీహెచ్‌సీకి తరలించారు. బావయ్య తల్లి చంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన షాద్‌నగర్‌లోని ఆశా కాలనీలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం బాటపల్లికి చెందిన చిన్న లింగయ్య, భార్య మేఘన, ఇద్దరు పిల్లలతో షాద్‌నగర్‌లో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. కొన్ని రోజుల క్రితం సొంతూరులో జరిగిన శుభకార్యానికి వెళ్లారు. షాద్‌నగర్ వెళ్తున్నానని భార్యకు చెప్పి వచ్చాడు. సోమవారం ఉదయం భార్య ఫోన్‌చేయగా లిఫ్ట్‌చేయలేదు. చుట్టుపక్కల వారితో విచారించగా ఫ్యాన్‌కు ఉరేసుకున్నట్టు గుర్తించారు. వెంటనే మేఘన షాద్‌నగర్ చేరుకున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాత

షాబాద్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి):విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన సంఘటన దైవాలగూడలో మంగళవారం చోటుచేసుకుంది. రైతు తాళ్లపల్లి అనిల్ తెలిపిన వివరాల మేరకు.. పొలం వద్ద ఆవు మేస్తున్న సమయంలో విద్యుత్ వైర్ తగిలి షాక్‌తో మృతిచెందింది. పాడి ఆవు మృతితో రైతు అనిల్ విలపించాడు. రూ.1.3లక్షల విలువ చేసే ఆవు చనిపోయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.

జీవాల ఆరోగ్యంతోనే పోషకులకు లాభం


జీవాలకు టీకాలు వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): జీవాలు ఆరోగ్యంగా ఉంటేనే రైతులకు లాభం చేకూరుతుందని, అందుకు జాగ్రత్తలు తీసుకోవాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మద్దూర్, రేగడిదోస్వాడ గ్రామాల్లో గొర్లు, మేకల్లో వచ్చే పేగువ్యాధి నిరోధక టీకాలు వేశారు. పశువులకు రోగాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది బాల్‌రాజ్, గోపి, శ్రీనివాస్, కృష్ణమూర్తి, సుధాకర్, రైతులు పాల్గొన్నారు

శంకర్‌పల్లి: జీవాలకు టీకాలు వేయించాలని శంకర్‌పల్లి మండల పశు వైద్యురాలు మానసరెడ్డి తెలిపారు. మండలంలోని గ్రామాల్లో మేకలు, గొర్రెలకు టీకాలు వేశారు. ఆమె మాట్లాడుతూ.. 26వ తేదీ నుంచి వచ్చే నెల 10 వరకు గ్రామాల్లో టీకాలు వేస్తామన్నారు.

మాడ్గుల మాజీ ఎంపీటీసీ షబ్బీర్ మృతి


షబ్బీర్ మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

మాడ్గుల, అగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మాడ్గుల, మాజీ ఎంపీటీసీ సయ్యద్ షబ్బీర్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి ఆస్పత్రిలో మృతిచెందారు. మృతదేహాన్ని మంగళవారం మాడ్గులకు తెచ్చారు. మాజీ ఎంపీపీ జంగయ్య, నాయకులు యాదయ్యగౌడ్, సూదిని కోదండ వెంకట్‌రెడ్డిలు షబ్బీర్ మృతదేహానికి నివాళులు అర్పించారు. నాయకులు షబ్బీర్ సేవలను కొనియాడారు. ఆయన హైదరాబాద్‌లో వాహన డ్రైవర్‌గా పనిచేసి కుటుంబాన్ని పోషించేవాడు. నివాళులు అర్పించిన వారిలో నాయకులు అరవింద్‌గౌడ్, కృష్ణయ్యగౌడ్, హుస్సేన్ ఉన్నారు.

కొత్తగూడ ముదిరాజ్ కమిటీ ఎన్నిక


కొత్తగూడ ముదిరాజ్ కమిటీని సన్మానిస్తున్న పిట్టల పాండు

కందుకూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కొత్తగూడ ముదిరాజ్ సంఘం కమిటీని ఎన్నుకున్నట్లు సంఘం మండలాఅధ్యక్షుడు పిట్టల పాండు తెలిపారు. మంగళవారం వివరాలు వెల్లడించారు. అధ్యక్షుడిగా పిట్టల యాదయ్య, ఉపాధ్యక్షుడు మెరుగు కృష్ణ, ప్రధాన కార్యదర్శి చీమల శేఖర్, యూత్ అధ్యక్షుడు తాళ్ల మహేందర్, ఉపాధ్యక్షుడు శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి గద్దగూటి శివలను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాలేష్, నర్సింహ, సురేష్, బిక్షపతి, రవి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

యంత్ర పరికరాలకు దరఖాస్తు చేసుకోండి

మాడ్గుల, అగస్టు 25(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సబ్సిడీ యంత్ర పరికరాలకు చిన్న, సన్నకారు రైతులు దరఖాస్తు చేసువాలని ఏవో అరుణకుమారి మంగళవారం తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్లు, రోటో వేటర్లు, కల్టివేటర్ తదితర పనిముట్లను సబ్సిడీపై అందజేస్తామన్నారు. ఎస్సీఎస్టీ రైతులకు 50 శాతం ఇతర రైతులకు 40శాతం సబ్సిడీ వస్తుందన్నారు.

రైతులకు యూరియా అందజేయాలి

మాడ్గుల, అగస్టు 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు సరిపడ యూరియా సరఫరా చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని బీజేపీ మాడ్గుల మండల అధ్యక్షుడు నల్లకాసుల పెద్దయ్యయాదవ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ అలసత్వం వల్లే యూరియా కొరత నెలకొందన్నారు. కొందరు యూరియాను బ్లాక్ చేసి కొరత సృష్టిస్తున్నారని మండిపడ్డారు. రైతులకు యూరియాను అందించాలని బీజేపీ డిమాండ్ చేస్తూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఎరుకలి కాటం, మండల నాయకులు మెట్టు శ్రీను, నిరంజన్, పల్లేటి జగన్ పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేత
